క్లుప్తంగా

## ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు



ధ్వజారోహణ కార్యక్రమంలో గ్రామస్తులు

కామేపల్లి(కారేపల్లి): మండల పరిధిలోని పండితాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో గురువారం విగ్రహాల ప్రతిష్ఠ, ధ్వజారోహణ కార్యక్రమాలను గ్రామస్తులు వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య అంగరంగవైభవంగా నిర్వహించారు. భక్తులు వేలాదిగా తరలివచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ బానోత్ వెంకటప్రవీణ్‌కుమార్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, గింజల నరసింహారెడ్డి, మాదినేని రమేష్, దమ్మాలపాటి సత్యనారాయణ, రెడబోతు గోపిరెడ్డి, రాంరెడ్డి జగన్నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బడుల ప్రారంభంలోగా యూనిఫాం అందివ్వాలి

కూసుమంచి: జూన్‌లో పాఠశాలలు పునఃప్రారంభంలోగా పాఠశాలలకు వచ్చే పిల్లలందరికీ యూనిఫాం సిద్ధంగా ఉంచాలని విద్యాశాఖ కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి (సీఎంఓ) రాజశేఖర్ సూచించారు. గురువారం కూసుమంచిలోని ఎంఈఓ కార్యాలయంలో పలు అంశాలపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మన ఊరు –మన బడి కార్యక్రమంలో భాగంగా ఐఎఫ్‌పీ పరికరాల పనితీరు, పాఠ్య పుస్తకాల సరఫరా, పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ మధు, సీఆర్పీలు వెంకటేశ్వర్లు, జాఫర్, వెంకటర్‌కుమార్, మైసయ్య, ఉపేందర్, రవి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## రైతులందరూ ఈ–కేవైసీ చేయించుకోవాలి



మాట్లాడుతున్న ఏడీఏ విజయచంద్ర

తిరుమలాయపాలెం: కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి రైతులందరితో ఈ–కేవైసీ చేయించుకునేలా చూడాలని కూసుమంచి ఏడీఏ విజయచంద్ర ఏఈఓలను ఆదేశించారు. గురువారం తిరుమలాయపాలెంలో వ్యవసాయ విస్తర్ణాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పచ్చిరొట్ట ఎరువుల మొలక శాతాన్ని పరీక్షించి ఫలితాలు రాగానే విత్తనాలు పంపిణీ చేయాలన్నారు. రైతు దినోత్సవ వేడుకలకు రైతు వేదికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. మండల వ్యవసాయాధికారి సీతారాంరెడ్డి, ఏఈఓలు పాల్గొన్నారు.

## కుటుంబం చెంతకు చేర్చిన ‘అన్నం’



ఆత్మారాంను కుటుంబీకులకు అప్పగిస్తున్న అన్నం శ్రీనివాసరావు, ఏసీపీ రెహమాన్

ఖమ్మంఅర్బన్: మతిస్థిమితం లేక ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వ్యక్తిని గత నెల 25న అన్నం సేవా ఫౌండేషన్‌కు తరలించగా ఆయన వివరాలు ఆరా తీసి కుటుంబం చెంతకు చేర్చారు. సదరు వ్యక్తి కోలుకున్నాక వివరాలు ఆరా తీయడంతో మహారాష్ట్రలోని బీడ్‌కు చెందిన ఆత్మారాం భారతి అని చెప్పడంతో తండ్రి ఆత్మారాం, బావను పిలిపించి గురువారం వైరా ఏసీపీ రెహమాన్ సమక్షాన అప్పగించామని అన్నం ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు. కాగా, ఏసీపీ కార్యాలయ హెడ్‌కానిస్టేబుల్ అప్పారావు – వాణి దంపతులు వారి కుమారుడు ప్రభువర్మ పెళ్లిరోజు సందర్భంగా ఫౌండేషన్‌లో అన్నదానం చేశారు.

## చెడు వ్యసనాలకు బానిస కావొద్దు

ఖమ్మంరూరల్: నేడు యువత ఎక్కువ భాగం మద్యం, ధూమపానం, బెట్టింగ్ వంటి చెడు వ్యసనాలకు బానిసలై జీవితాలను పాడు చేసుకుంటున్నారని, అటువంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని వైద్యుడు కూరపాటి ప్రదీప్ అన్నారు. గురువారం మండలంలోని రెడ్డిపల్లిలో డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలు, బెట్టింగ్ యువతపై ప్రభావం అనే అంశంతో జరిగిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నాయకులు ఊరడి విజయ్, వట్టికోట నరేష్, తాటి వెంకటేశ్వర్లు, తోట నరేష్, అరవింద్, కూరపాటి శ్రీను, నాగేశ్వరరావు, మల్లికార్జున్, సిద్ధు, చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావసరాలకు..‘వేదికలు’!

**ఇకపై రైతు వేదికల్లో అన్ని ప్రభుత్వ శాఖల సమావేశాలు**

- రైతులకు మరింత అందుబాటులోకి రానున్న వ్యవసాయ శాఖ సేవలు
- నిత్యం వినియోగంలోకి వచ్చేలా కార్యాచరణ
- ప్రభుత్వ నిర్ణయంపై పలువురి హర్షం





రాజేశ్వరపురంలోని రైతు వేదిక



నేలకొండపల్లి రైతు వేదిక వద్ద భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు(ఫైల్)

నేలకొండపల్లి: తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన రైతు వేదికలు ఇక నుంచి ప్రజావసరాలకు కూడా వినియోగించనున్నారు. ప్రస్తుతం వ్యవసాయ శాఖ సమావేశాలు.. రైతులకు అవగాహన సదస్సులకు మాత్రమే వేదికలు ఉపయోగించేవారు. అది కూడా నెలకు రెండు లేదా మూడు దఫాలుగా సమావేశాలు నిర్వహిస్తారంతే. అందులో ప్రతీ ఖరీఫ్, రబీ సీజన్‌లో తప్పకుండా సమావేశాలు జరుగుతాయి. ఇక నుంచి రైతు వేదిక క్లస్టర్ పరిధిలోని విస్తరణ అధికారులు నిత్యం అక్కడే అందుబాటులో ఉండడంతో పాటు ప్రభుత్వంలోని అన్ని శాఖల అధికారులు కార్యక్రమాలు నిర్వహించేందుకు వాటిని వినియోగించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

**నిర్వహణకు నిధులు..**

పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్ మండలంలో ఐదు, నేలకొండపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెంలో ఎనిమిదేసి చొప్పున మొత్తం 29 క్లస్టర్లలో రైతు వేదికలు ఉన్నాయి. కానీ చాలావాటికి స్థలాలు లేక ఊరికి దూరంగా నిర్మించారు. కాగా, మండల కేంద్రాల్లో ఉన్న వేదికలు వినియోగంలో ఉన్నా.. మిగతా వాటిలో అవగాహన కార్యక్రమాలు అంతంత మాత్రంగానే జరుగుతున్నాయి. రైతులు, ఎరువుల డీలర్ల సమావేశాలు తప్ప మిగతా సమయంలో ఖాళీగా ఉంటాయి. ఒక్కో రైతు వేదికకు రూ. 12 లక్షలు చొప్పున ఖర్చు చేసి మైకులు, కుర్చీలు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించారు. నిర్వహణ కోసం ప్రతి నెలా ప్రభుత్వం రూ.9 వేలు ఇస్తోంది. ఇప్పటి వరకు అనుకున్నంత స్థాయిలో ఇవి వినియోగంలోకి రాలేదు. ఏటా భూసార పరీక్షల కోసం సాంకేతిక వ్యవస్థను ఏర్పాటు చేసి రైతులకు సహకారం అందించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది.

### ఆదేశాలు అందాయి..



రైతు వేదికల వినియోగంలో ప్రభుత్వం నుంచి లిఖిత పూర్వక ఆదేశాలు వచ్చాయి. కానీ ఇంకా విధి విధినాలు రావాల్సి ఉంది. ప్రభుత్వ శాఖల సమావేశాలు, కార్యక్రమాల నిర్వహణ గురించి వ్యవసాయ శాఖను సంప్రదించి సమావేశ వివరాలు అందిస్తే.. వాటికి అనుగుణంగా కేటాయించేలా చేస్తాం.

– ఎస్.విజయచంద్ర, ఏడీఏ, కూసుమంచి

### ప్రభుత్వ నిర్ణయం సరైనదే..



రైతు వేదికలను ప్రజావసరాలకు వినియోగించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చాలా మంచిది. అన్ని ప్రభుత్వ శాఖలకు ఉపయోగకరంగా ఉంటుంది. ప్రభుత్వంలో ఉన్న అన్ని శాఖల సమావేశాలు, సదస్సులు, ఇతరత్రా కార్యక్రమాలు చేపట్టేందుకు వీలుండేలా అవకాశం కల్పించారు.

– శాఖమూరి సతీష్, రైతు సమన్వ సమితి మండల అధ్యక్షుడు

### ఇబ్బందులు తొలగినట్లే..



రైతు వేదికల్లో అవకాశం కల్పించడం వల్ల ఏదైనా సమావేశాలు ఏర్పాటు చేయాలంటే ఫంక్షన్ హాళ్లను వెతుక్కోవాల్సి వస్తోంది. ప్రభుత్వం నిర్ణయంతో చాలా వరకు ఇబ్బందులు తొలిగినట్లే. ఇక నుంచి ప్రభుత్వ కార్యక్రమాలు అన్ని శాఖల వారికి అందుబాటులో ఉంటాయి.

– నెల్లూరి లీలాప్రసాద్, చెరుకు అభివృద్ధి మండలి చైర్మన్, నేలకొండపల్లి

## ‘ఉపాధి’ కూలీలపై చిన్నచూపు తగదు



కూలీలతో మాట్లాడుతున్న సంఘం నాయకులు

కామేపల్లి(కారేపల్లి): ఉపాధి కూలీల పట్ల అధికారులకు చిన్నచూపు తగదని, పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ అన్నారు. గురువారం మండల పరిధిలోని లాల్యాతండా, ముద్దులపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను సంఘం ఆధ్వర్యంలో పరిశీలించాక ఆయన మాట్లాడారు. కూలీలకు ఉపాధి కూలి బంధు, కూలి బీమా ప్రకటించాలని, కొలతలతో సంబంధం లేకుండా రోజుకు రూ.600లు కూలి చెల్లించాలని, 200 రోజుల పని దినాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాధావత్ శ్రీను, గుండా వెంకటరెడ్డి, ఆదప రామనాథం, కందూరి వెంకటరెడ్డి, ఉపాధి కూలీలు నిర్మల, సైదులు, ధరావత్ రఘు, గుగులోతు రామ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల విద్యార్థుల ప్రతిభ

రఘునాథపాలెం: తెలంగాణ ప్రభుత్వం గురువారం విడుదల చేసిన ఎంసెట్ ఫలితాల్లో తెలంగాణ మైనారిటీ గురుకుల కళాశాల బాలికలు–1 విద్యార్థినులు ప్రతిభ చాటారని కాలేజ్ ప్రిన్సిపాల్ అబిద సల్మా తెలిపారు. ఎంపీసీ నుంచి 33 మంది పరీక్ష రాయగా 25 మంది, బైపీసీ నుంచి 29 మంది పరీక్ష రాయగా 24 మంది క్వాలిఫై అయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను జిల్లా మైనారిటీ ఆఫీసర్లు ముజఫర్, మహమూది, ఎస్‌కే అరుణకుమారి, జమీల్ పాషా, సీతారాములు, అఫ్రోజ్ తదితరులు అభినందించారు.

## పోస్టర్లు ఆవిష్కరణ..

నేలకొండపల్లి: జూన్ 4వ తేదీన కొత్తగూడెంలో జరిగే ప్రజా గర్జన సభను విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి కర్నాటి భానుప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని కొత్తకొత్తూరులో ప్రజాగర్జనకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించిన సదర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజాసంపదను దోచిపెడుతూ మతం, కులం పేరుతో ప్రాంతాలు, ప్రజల మధ్య చిచ్చు పెడుతున్న బీజేపీ పాలనలో అవినీతిపరులు, అక్రమాలు ఎక్కువయ్యాయన్నారు. కర్ణాటక ఫలితాలతో బీజేపీ పతనం ప్రారంభమైందని చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ మండల సహాయ కార్యదర్శి మారెశెట్టి వెంకటేశ్వరరావు, నాయకులు కాశిబోయిన అయోధ్య, మేకల పుల్లయ్య, కనకబండి సీతారాములు, ఉపేందర్, కర్నాటి నళిని, మల్లయ్య, పోలంపల్లి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ మహా ధర్నాలో ఖమ్మం యాదవులు

ఖమ్మంఅర్బన్: మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు యాదవ్ జాతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి యాదవ్ జాతికి క్షమాపణ చెప్పడంతో పాటు తన మాటలు ఉపసంహరించుకోవాలని ఇందిరా పార్క్‌లో జరిగిన మహాధర్నాలో గురువారం ఖమ్మం జిల్లా యాదవులు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా అఖిల భారత యాదవ మహాసభ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు చిలకల వెంకటనరసయ్య, యాదవ యువజన సంఘం అధ్యక్షుడు చిత్తార్ సింహాద్రి, ఉపాధ్యక్షులు మెత్రిమేకల కోటయ్య, సత్తి వెంకన్న, రాగం కోటేష్, బండారు ప్రభాకర్, మేడిదులు మలేష్, తెల్లబోయిన రమణ, తదితరులు గాంధీభవన్ ముట్టడి కార్యక్రమంలో పాల్గొనగా పోలీసులు అరెస్ట్ చేశారు.

## జడ్చర్లకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

నేలకొండపల్లి: సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క జడ్చర్లలో తలపెట్టిన బహిరంగ సభకు గురువారం నేలకొండపల్లి నుంచి భారీగా తరలివెళ్లారు. మండల కేంద్రంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు జెండా ఊపి వాహన ర్యాలీని ప్రారంభించారు. కాంగ్రెస్ సేవాదళ్ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు, వేణు, వంశీ, నవీన్, భూ చక్రవర్తి, విజయ్, గాలిబు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినులకు ప్రోత్సాహక సాయం



నగదు అందిస్తున్న కొండలరావు, తదితరులు

ఖమ్మంఅర్బన్: పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన మెకానిక్‌ల కుమార్తెలకు జిల్లా టూవీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన గురువారం నగదు ప్రోత్సాహక సాయం అందజేశారు. ఈ సందర్భంగా అప్పం కీర్తన, కుక్కల శ్రీజ, తమ్మిశెట్టి వర్షిత, మేడి సౌజన్యకు రూ.5వేలు చొప్పున సంఘం అధ్యక్షుడు వంగాల కొండలరావు గురువారం అందజేసి మాట్లాడారు. ఆడపిల్లలను చదువులలో ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ నగదు అందజేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో నాయకులు అప్పారావు, శ్రీను, రమేష్, రవి, శేషు, నాగభూషణం, లాలయ్య పాల్గొన్నారు.

## ఎన్‌సీసీ అబ్‌స్టాకిల్స్ ప్రారంభం

ఖమ్మంఅర్బన్: నగరంలోని బల్లేపల్లిలో గల బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల ఆవరణలో గురువారం ఎన్‌సీసీ ట్రైనింగ్, డిఫెన్స్ అకాడమీ కోసం నూతనంగా ఏర్పాటు చేసిన అబ్‌స్టాకిల్స్ గ్రూప్ కమాండర్ కల్నల్ హెచ్‌పీ దూబె ప్రారంభించారు. తొలుత ఎన్‌సీసీ విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎన్‌సీసీ తెలంగాణ–11 బెటాలియన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న కంబైన్డ్ వార్షిక శిక్షణలో భాగంగా దీన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పి. అశోక్ రెడ్డి, ప్రిన్సిపాల్ వి.కిరణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ జి.ప్రసాద్, ఎన్‌సీసీ ట్రైనింగ్ ఆఫీసర్ కల్నల్ నాగరాజు, లెఫ్ట్ కల్నల్ నవీన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## లేగ దూడలు అందజేత



దూడను అందజేస్తున్న మహేశ్ అగర్వాల్

కూసుమంచి: మండలంలోని లాల్‌సింగ్‌తండాలో గల శ్రీలక్ష్మీతిరుపతమ్మ తల్లి గోశాల ఆధ్వర్యాన గురువారం పది మంది రైతులకు గోశాలల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేశ్ అగర్వాల్ దూడలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు గోవులను పూజించడంతో పాటు సంరక్షించాలని తెలిపారు. గోవధను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో గోశాల ప్రతినిధి వెంకట్, సర్పంచ్ దరావత్ వెంకట్, ఉప సర్పంచ్ భూక్యా నీరజ తదితరులు పాల్గొన్నారు.

## క్రైం కార్నర్

### చికిత్స పొందుతూ మృతి

రఘునాథపాలెం: కుటుంబ కలహాలు, అనారోగ్య సమస్యలతో గడ్డి మందు తాగిన మండలంలోని ఎస్‌పీ.బంజర్‌కు చెందిన వినోద్(28) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయనకు ఎనిమిదేళ్ల క్రితం జరగగా, అనారోగ్య సమస్యలతో భార్యాభర్తలు దూరంగా ఉంటున్నారు. ఆతర్వాత గ్రామంలో పంచాయితీ చేయడంతో మానసికంగా దెబ్బతిన్న వినోద్ ఈనెల 15న గడ్డిమందు తాగడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఘటనపై ఆయన తండ్రి లింగా ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు రఘునాథపాలెం పోలీసులు తెలిపారు.

**సర్పంచ్‌పై దాడి ఘటనలో కేసు నమోదు..**

సర్పంచ్‌పై దాడి చేసిన తండ్రీకొడుకులపై రఘునాథపాలెం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్పీ బంజర సర్పంచ్ జర్పుల సక్రాం గురువారం గ్రామంలో వినోద్ అనే వ్యక్తి చనిపోవడంతో అక్కడికి వెళ్లాడు. అక్కడే ఉన్న మృతుడి పెద్ద నాన్న జర్పుల శంకర్ సర్పంచ్ వద్దకు వచ్చి పంచాయితీ చేయడం వల్లే వినోద్ చనిపోయాడని ఆరోపిస్తూ దాడి చేయగా, శంకర్ కుమారుడు రమేశ్ అసభ్యంగా దూషిస్తూ చేయి చేసుకున్నాడు. దీంతో సర్పంచ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవి తెలిపారు.

**దాడి ఘటనపై కేసు..**

భూమి సరిహద్దు విషయంలో కక్ష పెంచుకొని దాడి చేసిన ఘటనలో రఘునాథపాలెం పోలీసులు గురువారం ముగ్గురిపై కేసు నమోదు చేశారు. వి.వెంకటాయపాలెంకు చెందిన బానోత్‌వెంకన్నకు అదే గ్రామానికి చెందిన బానోత్ శేఖర్‌తో భూమి సరిహద్దుపై వివాదం జరుగుతోంది. ఈక్రమంలో శేఖర్ ఈనెల 23న రాహుల్, నాగను తీసుకెళ్లి వెంకన్నతో పాటు ఆయన తల్లిపైనా దాడి చేశారు. ఈమేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవి తెలిపారు.

## ఎమ్మెల్యే కందాల విస్తృత పర్యటన



బీమా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి

కూసుమంచి/నేలకొండపల్లి/తిరుమలాయపాలెం: మండలాల్లో పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి గురువారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కూసుమంచి, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి మండలాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అలాగే, కూసుమంచి మండలంలోని జక్కేపల్లి సహకార సంఘం ద్వారా రైతులకు అందిస్తున్న జీలుగు విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీలు వజ్జా రమ్య, బానోత్ శ్రీనివాస్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు. అంతేకాక తిరుమలాయపాలెం మండలం బాలాజీనగర్‌తండాలో రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందిన భూక్యా వీరన్నకు పార్టీ సభ్యత్వం ద్వారా మంజూరైన రూ.2లక్షల చెక్కును మృతుడి భార్య లింగమ్మకు ఎమ్మెల్యే అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోహన్, బాలు, సుక్యా తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మేయర్ నీరజ

ఖమ్మం సహకారనగర్/ఖమ్మంఅర్బన్: నగరంలోని ఖాజీపుర హైస్కూల్‌లో డైనింగ్ హాల్, టాయిలెట్ల నిర్మాణానికి మేయర్ పునుకొల్లు నీరజ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు–మన బడి, మన బస్తీ–మన బడి ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేస్తుందన్నారు. మున్సిపల్ సాధారణ నిధుల నుంచి సుమారు రూ.10.95లక్షలతో పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది స్వరూపరాణి, జ్యోతి, సతీష్, స్థానికులు గౌతమ్‌బాబా తదితరులు పాల్గొన్నారు. అలాగే, నగరంలోని ఒక హోటల్‌లో ఖమ్మం గ్రానైట్ టైల్స్ అండ్ పాలిషింగ్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవానికి ముఖ్య అతిథిగా మేయర్ పాల్గొని వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మేయర్‌తో పాటు ఖమ్మం సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, సంఘం మాజీ అధ్యక్షుడు, కార్పొరేటర్ నాగండ్లకోటి తదితరులు మాట్లాడారు. ప్రమాణ స్వీకారం చేసిన వారితో ఖమ్మం గ్రానైట్ టైల్స్ అండ్ పాలిషింగ్ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మహమ్మద్ నసీరుద్దీన్, ప్రధాన కార్యదర్శి విజయ భాస్కర్, కోశాధికారి భీక్షమారెడ్డి, ఇతర సభ్యులు ఉన్నారు.

## ‘కంటి వెలుగు’ను వినియోగించుకోవాలి



నేత్ర వైద్యుడిని సన్మానిస్తున్న దృశ్యం

రఘునాథపాలెం: కంటి వెలుగు శిబిరాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకొని కంటి పరీక్షలు చేయించుకోవాలని ఎంపీపీ భూక్యా గౌరి సూచించారు. గురువారం మండలంలోని రేగులచలకలో కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈకార్యక్రమాల్లో సర్పంచ్‌లు కొర్లపాటి రామారావు, మాదంశెట్టి హరిప్రసాద్, ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వీరూనాయక్‌తో పాటు చిరుమామిళ్ల రవికిరణ్, మున్నా శ్రీనివాసరావు, మున్నా వెంకటేశ్వర్లు, పిన్ని కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

**‘కంటి వెలుగు’కు విశేష స్పందన..**

ఖమ్మంమయూరిసెంటర్: గత పదిహేను రోజుల పాటు నగరంలోని 36వ డివిజన్‌లో నిర్వహించిన కంటి వెలుగు శిబిరం గురువారంతో ముగిసినట్లు స్థానిక కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్‌రావు అన్నారు. ఈ సందర్భంగా శిబిరం విజయవంతానికి కృషి చేసిన వైద్యులు, సిబ్బందిని, ఏఎన్‌ఎంలు, ఆర్పీలు, అంగన్‌వాడీ టీచర్లను సత్కరించారు. ఈ శిబిరంలో 1400 మందికి కంటి పరీక్షలు, 20 మందికి కంటి ఆపరేషన్లు, 530 మందికి కళ్లజోళ్లు అందించినట్లు కార్పొరేటర్ తెలిపారు. శ్రీనివాస్‌నగర్ పీహెచ్‌ఈ డాక్టర్ లోహిత, కంటి వెలుగు ఇన్‌చార్జ్ బాలకృష్ణ, డీసీసీబీ సీఈఓ వీరబాబు, హెల్త్ సూపర్‌వైజర్ వేణు, డాక్టర్ లికిత, బీఆర్‌ఎస్ నాయకులు కన్నం ప్రసన్న కృష్ణ పాల్గొన్నారు.

## వీరబ్రహ్మేంద్ర స్వామి గొప్ప సంఘ సంస్కర్త..



వెంకటాద్రి స్వామిని సత్కరిస్తున్న కమిటీ బాధ్యులు

ఖమ్మంగాంధీచౌక్: శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి గొప్ప సంఘసంస్కర్త అని ఆయన ముని మనువడు, బ్రహ్మంగారి మఠం ఎనిమిదో తరం 12వ పీఠాధిపతి వెంకటాద్రిస్వామి తెలిపారు. గురువారం నగరంలో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన బోనకల్ రోడ్డులోని గణపతి సాయిబాబా గోవిందమాంబ సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సమాజంలో జరుగుతున్న ఉత్పాతాల గురించి కాలజ్ఞానంలో ఆనాడే బ్రహ్మం గారు విశదీకరించినట్లు తెలిపారు. అనంతరం ఆయల కమిటీ ప్రతినిధులు వెంకటాద్రి స్వామిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు నేలకొండ వీరాచారి, చిట్టోజు చిదంబరాచారి, కీసర బాబు, సతీష్ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.


## మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

ఖమ్మంగాంధీచౌక్: రోహిణి కార్తె ప్రారంభం సందర్భంగా ఖమ్మం ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని కమాన్‌బజార్ రైల్వే మధ్య గేటు, ప్రభాత్ టాకీస్ సెంటర్లలో బాటసారులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ కార్పొరేషన్ నూతన అధ్యక్షుడు తూములూరి లక్ష్మీనరసింహారావు, ప్రధాన కార్యదర్శి ఊటుకూరి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు దాచేపల్లి నాగేంద్రబాబు, సహాయ కార్యదర్శి వసుపులేటి లక్ష్మీనరసింహారావు పాల్గొన్నారు. అలాగే నగరంలోని త్రీటౌన్ వర్తక సంఘం భవనం వద్ద మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం ప్రారంభించారు. సంఘం ప్రతినిధులు కైలాసపు వేణుగోపాల్‌రావు, పాయల నాగేశ్వరరావు, నేరెళ్ల శేషగిరి, జె.రమణ, పి.శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే జైలుకే..

రఘునాథపాలెం: రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే జైలుపాలు కావడం ఖాయమని వ్యవసాయశాఖ ఏడీఏ శ్రీనివాస్, రఘునాథపాలెం ఎస్సై ఎం.రవి పేర్కొన్నారు. గురువారం రఘునాథపాలెంలోని రైతు వేదికలో మండలంలోని విత్తన వ్యాపారులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. రైతులందరూ లైసెన్స్ డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేసి తప్పక రశీదు తీసుకోవాలని చెప్పారు. అలాగే ఎస్సై మాట్లాడుతూ.. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి భాస్కరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డీలర్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

## ‘మమత’లో విజయవంతంగా శస్త్ర చికిత్సలు



వివరాలు వెల్లడిస్తున్న పువ్వాడ జయశ్రీ, పక్కన వైద్యులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని మమత ఆస్పత్రిలో గడిచిన పది రోజుల్లో న్యూరో విభాగానికి సంబంధించి పలువురికి క్లిష్టమైన ఆపరేషన్లు విజయవంతంగా పూర్తిచేశామని మమత సంస్థల కార్యదర్శి పువ్వాడ జయశ్రీ తెలిపారు. ఈమేరకు న్యూరో ప్రొఫెసర్ డాక్టర్ జగదీష్‌తో కలిసి గురువారం వివరాలు వెల్లడించారు. వైద్యరంగంలో కీలకమైన ట్రామా, బ్రెయిన్ ట్యూమర్, స్పైన్ ట్యూమర్ తదితర బాధితులు సూర్యాపేట జిల్లాకు చెందిన గోపయ్య, అశ్వారావుపేటకు చెందిన వెంకమ్మ, మహబూబాబాద్ జిల్లాకు చెందిన శ్రీకాంత్, ములకలపల్లికి చెందిన రాహేలా, ఖమ్మంకు చెందిన హనుమంతు, తిరుమలాయిపాలెంకు చెందిన రాజుకు చికిత్స చేయగా పూర్తిగా కోలుకున్నారన్నారు. మమత వైద్య విద్యాసంస్థల చైర్మన్ పువ్వాడ అజయ్‌కుమార్, ఫౌండర్ చైర్మన్ పువ్వాడ నాగేశ్వరరావు పర్యవేక్షణలో మహానగరాల్లో మాత్రమే చేసే శస్త్రచికిత్సలను తమ వద్ద అధునాతన విధానాల్లో చేస్తున్నట్లు తెలిపారు.సూపరింటెండెంట్ రామస్వామి, డీన్, ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్, టీ.వీ.బాబు, యుగేందర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.